పోలీస్ కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

అమరుడు పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి

నారాయణఖేడ్, డిసెంబర్ 1: మలిదశ తెలంగాణ ఉద్యమంలో అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతిని పురస్కరించుకొని నారాయణఖేడ్ స్థానిక ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ముదిరాజ్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోలీస్ కిష్టయ్య ఆత్మ బలిదానం చేసుకోవడం రాష్ట్ర ఏర్పాటుకు నాంది పలికిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, రాములు, పరమేశ్, రాంచందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కాలనీల అభివృద్ధి

నీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అమీన్‌పూర్, డిసెంబర్ 1: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడ సాయి యాక్సిస్ హోమ్స్ కాలనీలో రూ.60 లక్షలతో నిర్మించిన నీసీ రోడ్డును ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మండల పరిధిలోని గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం కావడంతో అభివృద్ధి శరవేగంగా కొనసాగుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

అమీన్‌పూర్, డిసెంబర్ 1: మున్సిపల్ పరిధిలోని శంకర్ గ్రీన్ హోమ్స్ కాలనీలో ఏర్పాటుచేసిన కార్తిక మాస వనభోజనాల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరసింహా గౌడ్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

రామచంద్రాపురం, డిసెంబర్ 1: బీహెచ్ఈఎల్ హాకీ గ్రౌండ్‌లో మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులతో కలిసి షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో వేసి అలరించారు. నిర్వాహకులు ఇక్బాల్, సత్యనారాయణ, శామ్యూల్, పద్మ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న రాజేశ్వర్

జహీరాబాద్, డిసెంబర్ 1: వ్యక్తిత్వ వికాసం పెంపుతోపాటు మానసిక ఒత్తిడిని అధిగమించడానికి అవగాహన పెంచుకోవాలని జిల్లా ఇంపాక్ట్ ఫౌండేషన్ రిసోర్స్‌పర్సన్ రాజేశ్వర్ అన్నారు. ఆదివారం జహీరాబాద్ మండలంలోని రంజోల్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాగా చదవి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఒత్తిడికి గురికాకుండా పోటీ పరీక్షలు రాస్తే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సృజన, జేవీపీ దీపిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన బొల్లారం విద్యార్థులు

పోటీల్లో మూడో స్థానంలో నిలిచి మెడల్స్ సాధించిన విద్యార్థుల జట్టు

బొల్లారం, డిసెంబర్ 1: మొయినాబాద్‌లో నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఇంటర్ స్కూల్ గురుకుల పోటీల్లో బొల్లారం మున్సిపాలిటీలోని జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల క్రికెట్ జట్టు మూడో స్థానంలో నిలిచి మెడల్స్ సాధించారు. అండర్ 14 విభాగంలో మెడల్స్ సాధించిన 13 మంది విద్యార్థుల జట్టుతోపాటు కోచ్ విష్ణును పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ సతీశ్‌కుమార్, కోఫౌండర్ స్మితాభోగరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ నాగమణి అభినందించారు.

టిప్పు సుల్తాన్‌కు నివాళి

నివాళులర్పిస్తున్న నాయకులు

రామచంద్రాపురం, డిసెంబర్ 1: భారత స్వాతంత్ర్య సమరయోధుడు టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా ఆదివారం ఆర్సీపురంలో ఆయన చిత్రపటానికి ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖదీర్, సీనియర్ నాయకులు అబ్దుల్ ఘని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మల్లేశ్, శివకుమార్, రిహాన్‌ఖాన్, గఫర్ పాల్గొన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

నాగల్‌గిద్ద, డిసెంబర్ 1: సోయా కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మావినెళ్లి గ్రామంలో మహిళా ఉత్పత్తిదారుల సంఘం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే అమ్మి ప్రయోజనం పొందాలన్నారు. అనంతరం మావినెళ్లిలోని బసవేశ్వర్ ఆలయంలో పూజలు నిర్వహించి నూతనంగా చేపడుతున్న ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు గుండురావ్‌పాటిల్, అనిల్‌పాటిల్, రూప్‌సింగ్, సీఈవో రాజు ఉన్నారు.

'బగలాముఖి'లో ప్రత్యేక పూజలు

అమ్మవారిని దర్శించుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, డిసెంబర్ 1: శక్తిపీఠమైన బగలాముఖి అమ్మవారి సన్నిధిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం శివంపేట మండల కేంద్రంలో కొలువుదీరిన బగలాముఖి శక్తిపీఠంలో కార్తిక అమావాస్య సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, వాసుదేవారెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

బీఆర్ఎస్ నేతల గురుకుల బాట

- హాస్టళ్లలో వసతులపై ఆరా
- అపరిశుభ్ర వాతావరణంపై అసహనం
- విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న నాయకులు



ఎస్సీ హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొండాపూర్: గిర్మాపూర్ సంక్షేమ గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

సదాశివపేట, డిసెంబర్ 1: హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురుకుల బాటలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను బీఆర్ఎస్వీ నాయకులు పరిశీలించారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలు శుభ్రంగా లేవని, బాత్‌రూంలు అత్యంత దుర్భరంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు బెడ్‌షీట్లు లేవని చెప్పే పరిస్థితి నెలకొన్నదన్నారు. గురుకులాల్లో అత్యంత దయనీమమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. హాస్టల్‌లోని సమస్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌నాయక్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీహరి, క్రాంతి, వెంకట్, పాండునాయక్, రోషన్, నిఖిల్, అక్షయ్, నజీర్, రాము, చిన్న, సందీప్, అఖిల్ పాల్గొన్నారు.

అసౌకర్యాల మధ్యే చదువు

కొండాపూర్, డిసెంబర్ 1: నిర్లక్ష్యం నీడలో గురుకులాలు కొనసాగుతున్నాయని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి పడాల సతీశ్ ఆరోపించారు. బీఆర్ఎస్వీ గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకులాల్లో సమస్యలు పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనపడుతున్నదని, చలికాలం ప్రారంభమైనా విద్యార్థులకు బెడ్‌షీట్లు పంపిణీ చేయలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యార్థుల సంక్షేమానికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీహరి, నాయకులు క్రాంతి, వెంకట్, పాండునాయక్, రోషన్, నిఖిల్, అక్షయ్, నజీర్, రాము, చిన్న, సందీప్, అఖిల్, జయేందర్ పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా పుల్కల్ పీహెచ్‌సీ

పుల్కల్, డిసెంబర్ 1: పుల్కల్ పీహెచ్‌సీ ప్రారంభానికి సిద్ధమైంది. ఆగస్టు 26న నమ స్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన 'ఓపీ ఉన్నా.. సౌకర్యాలు సున్న'కథనానికి అధికారులు స్పందించారు. రోజుకు 120 నుంచి 150 మంది వరకు రోగులు వచ్చే దవాఖాన శిథిలావస్థకు చేరి పెచ్చులూడి ఎప్పుడు రోగుల మీద పడుతుందోనని రోగులు భయ భ్రాంతులకు గురయ్యారు. సమస్యలను గుర్తించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.56 కోట్లతో నూతనంగా బిల్డింగ్ నిర్మించింది. కానీ, ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదని కథనంలో వివరించగా అధికారులు స్పందించారు. మరుసటి రోజే ఆగస్టు 27న క్వాలిటీ డిపార్ట్‌మెంట్ వాళ్లను పంపించి నూతన భవనాన్ని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సౌకర్యం, డోర్లు, కిటికీలను బిగించారు. పనులన్నీ పూర్తి చేసుకొని ప్రస్తుతం బిల్డింగ్ ప్రారంభానికి సిద్ధమైంది.

దవాఖానలో మెరుగైన వసతులు

అందోల్, డిసెంబర్ 1: వైద్యారోగ్యశాఖ మంత్రి ఇలాకాలో 'వైద్యానికి సుస్తీ' అని జూలై 9న నమస్తే తెలంగాణ దిన పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జూలై 4న జోగిపేట దవాఖానలో సౌకర్యాలు, కొత్త బెడ్లు ఏర్పాటు చేసి క్లీన్ అండ్ గ్రీన్‌గా పరిసరాలు ఉంచడమే కాకుండా, డీసీహెచ్ ఆదేశాలతో స్టాఫ్ నర్స్, శానిటేషన్ కాంట్రాక్టర్‌కు మెమోలు జారీ చేశారు. పాడైపోయిన బెడ్లను తొలిగించి కొత్త బెడ్లను ఏర్పాటు చేశారు. టాయిలెట్లను శుభ్రం చేసి దవాఖాన మొత్తం క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడంతో దవాఖానకు వచ్చి పోయే రోగులు 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసులు అంకితభావంతో పని చేయాలి

కొత్తగా విధుల్లో చేరిన పోలీసులకు సూచనలు చేస్తున్న పట్టణ ఎస్ఐ కాశీనాథ్

జహీరాబాద్, డిసెంబర్ 1: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జహీరాబాద్, జహీరాబాద్ రూరల్, హద్నూర్, చిరాగ్‌పల్లి ఎస్ఐలు కాశీనాథ్, ప్రభాకర్‌రావు, చల్ల రాజశేఖర్, రాజేందర్‌రెడ్డి అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఆయా పోలీస్‌స్టేషన్లకు కేటాయించారు. ఆదివారం ఆయా పోలీస్‌స్టేషన్‌లో కొత్తగా వచ్చిన పోలీసులు ఎస్ఐలకు నియామక పత్రాలను అందజేసి విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐలు రూల్‌కాల్ సమావేశం ఏర్పాటు చేసి పోలీసుల విధుల పట్ల నిర్వర్తించాలని నిబంధనలు, నియమాలపై పలు సూచనలు చేశారు. ప్రజల హక్కులు ఆత్మగౌరవానికి భంగం కలగకుండా మంచి నడవడికతో ఉండాలన్నారు. శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజల్లో మంచిపేరు తెచ్చుకునేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పోలీస్‌స్టేషన్ల ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మల్లన్న జాతరను విజయవంతం చేయాలి

మల్లి మల్లన్నస్వామి జాతర గోడ, కర పత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జహీరాబాద్, డిసెంబర్ 1: న్యాల్‌కల్ మండలంలోని మల్లి మల్లన్నస్వామి బోనాల జాతరను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు మారుతీయాదవ్ కోరారు. ఆదివారం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులతో కలిసి జాతర గోడ, కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 7 నుంచి 13 వరకు ఆలయంలో ఉదయం 9 గంటలకు అభిషేకం, హారతి, అన్నప్రసాదం, రాత్రి 9 గంటలకు భజన కార్యక్రమం, 14న గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి నైవేద్యాలు తీసుకువచ్చి స్వామివారికి సమర్పించనున్నారు. 9న స్వామివారి జీవిత చరిత్ర విశేషాలు, 15న ఉదయం ఆలయం నుంచి గ్రామంలోకి స్వామివారి పల్లకీ సేవ ఊరేగింపు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిధారెడ్డి, రాజు, శివనంద శ్రీపతి, విఠల్, అర్జున్, కంటెప్ప, గుండప్ప, కిషన్‌రెడ్డి, సంజూరెడ్డి, మాణిక్, శంకర్, మారుతి, సాయి, సునీల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



మహా పడిపూజకు హాజరైన నాయకులు

గుమ్మడిదల, డిసెంబర్ 1: మండలంలోని రాంరెడ్డిబావి గ్రామంలో ఆదివారం అయ్యప్పస్వామి మహాపడిపూజను ఆ గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురుస్వామి అరుణ్‌స్వామి చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు నాగేందర్‌గౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, నాగభూషణం తదితరులు హాజరయ్యారు. ఈ పూజాకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్, కార్పొరేటర్ కాటా సుధారాణి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీఎంపీపీ దమ్మగౌని రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ దామోదర్‌రెడ్డి, నాయకులు మద్దిప్రతాప్‌రెడ్డి, వీరారెడ్డి, గోవర్ధన్‌గౌడ్, తులసీదాస్, పుట్ట నర్సింగ్‌రావు హాజరయ్యారు. పదునెట్టాంబడి జ్యోతిప్రజ్వలన చేయడంతో అయ్యప్పస్వామి శరణుఘోషలతో ఆ ప్రాంతం మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

టీపీయూఎస్ మండల కమిటీ ఎన్నిక

బొల్లారం, డిసెంబర్ 1: టీపీయూఎస్ జిన్నారం మండల కమిటీని ఆదివారం జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా రాజేశ్వర్(మాదారం), ఉపాధ్యక్షుడిగా కవిత(మంగంపేట), ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్(జిన్నారం), కోశాధికారిగా బ్రహ్మం(మాదారం) ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. జిల్లా కమిటీ పర్యవేక్షణలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మండల కమిటీ అహర్నిశలు కృషి చేస్తుందని విజయ్‌కుమార్ తెలిపారు.

కేతకికీ పోటెత్తిన భక్తజనం

ఆలయ ఆవరణలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఝరాసంగం, డిసెంబర్ 1: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం ఆదివారం కిటకిటలాడింది. కార్తిక అమావాస్య సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. భక్తులు గర్భగుడిలోని పార్వతి సమేత సంగమేశ్వర స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణంలో మహిళా భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. అదనపు ఎస్పీ సంజీవరావు, బీదర్ సౌత్ ఎమ్మెల్యే శైలేందర్ బెల్దార్ లెలు కుటుంబ సభ్యులతో కలిసి కేతకిని దర్శించి స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు అదనపు ఎస్పీకి, ఎమ్మెల్యేకు పూలమాల, శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఝరాసంగం ఎస్ఐ నరేశ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గుమ్మడిదల: ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎంఈవో రాంబాబు, ఉపాధ్యాయులు

తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం' అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపిక చేయనున్నారు. అక్కడ కూడా ప్రతిభ చూపితే రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని విద్యాశాఖ అధికారులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తెలిపారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 1

ఐఐటీహెచ్‌లో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్న ఐఐటీ జేఏసీ నాయకులు

కంది, డిసెంబర్ 1: ఐఐటీ హైదరాబాద్‌లో ఇతర రాష్ట్రాల వారికి కాకుండా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఐఐటీ ఉద్యోగాల పోరాట సమితి అధ్యక్షుడు ఆనందరావు డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఆదివారం కందిలో ఐఐటీ ఉద్యోగాల పోరాట జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కలివేముల ఆనంద్‌రావు, ఉపాధ్యక్షులుగా సీహెచ్ బాలకృష్ణ, సురేష్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఐఐటీహెచ్ ఏర్పాటులో కంది, చిమ్నాపూర్, మామిడిపల్లి, ఫసల్‌వాది గ్రామాల నుంచి భూములు తీసుకున్నా స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని ఉద్యోగాల్లో చేర్చుకొని ఇక్కడి యువతకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఐఐటీహెచ్ అడ్మినిస్ట్రేషన్ కంది నిరుద్యోగ యువకులకు ఉపాధి చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజేందర్, రమేశ్, శ్రీనివాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సింహగర్జనకు తరలివెళ్లిన మాలలు

అందోల్: హైదరాబాద్ బయలు దేరిన మాల మహానాడు నాయకులు

హత్నూర: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మాలల సింహగర్జన కార్యక్రమానికి పెద్దసంఖ్యలో మాలలు తరలివెళ్లారు. ముందుగా ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించి హైదరాబాద్ తరలివెళ్లారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 1

నేడు 'కేసీఆర్' సినిమా ఉచిత ప్రదర్శన

గుమ్మడిదల, డిసెంబర్ 1: ప్రత్యేక తెలంగాణ ఉద్యమసారథి, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చలనచిత్రాన్ని మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర సినిమా థియేటర్‌లో ఉచితంగా ప్రదర్శించనున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఉచిత ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తన సొంత ఖర్చులతో మూడు రోజులపాటు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రాన్ని ప్రదర్శించన్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు నాలుగు షోలు ఉంటాయని, ఉదయం 11 గంటలకు మార్నింగ్‌షో, 2 గంటలకు మ్యాట్నీ, 6 గంటలకు ఫస్ట్‌షో, 9 గంటలకు సెకండ్‌షో ఉంటుందని వివరించారు. ఈ చిత్రాన్ని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలాల ప్రజలు, కేసీఆర్ అభిమానులు వీక్షించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన ఉద్యమపోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో ఉండేవిధంగా చిత్రాన్ని చిత్రీకరించడం అభినందనీయమని తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

హత్నూర, డిసెంబర్ 1: గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. జిన్నారం సీఐ నహీముద్దీన్, హత్నూర ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మహిళను అక్కడకు తీసుకువచ్చి హత్యచేసిన అనంతరం పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఆదివారం తెల్లవారుజామున స్థానిక రైతులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కుక్కలు చిద్రం చేశాయి. ఒంటిపై వెండి కడియాలు, చెవులకు కమ్మలు ఇతరత్రా వస్తువులు ఉన్నాయి. క్లూస్‌టీం సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించినట్లు పేర్కొన్నారు. డాగ్‌స్క్వాడ్ ఘటనా స్థలం నుంచి ప్రధాన రహదారి వరకు వెళ్లినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి పూడ్చిపెట్టినట్లు తెలిపారు. కేసును త్వరలోనే ఛేదించి నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

గైని యోహాన్

కల్హేర్, డిసెంబర్ 1: ఇంట్లో నుంచి వెళ్లి మూడు రోజులు గడిచినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశం తెలిపారు. మండల పరిధిలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన గైని యోహాన్(55) గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనులు చేస్తున్నాడు. 28వ తేదీ ఉదయం 9గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. మూడు రోజులుగా ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువులను తెలుసుకోగా ఆచూకీ లభించలేదు. భార్య గైని స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

4న మెగా వైద్య శిబిరం

బొల్లారం, డిసెంబర్ 1: పారిశ్రామిక వాడల్లోని పేద ప్రజల కోసం ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ అన్నారు. ఈ నెల 4న గడ్డపోతారం గ్రామ పంచాయతీ ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్వీఎం దవాఖాన వైద్యుల ఆధ్వర్యంలో రోగులకు జనరల్ మెడిసిన్, మధుమేహం, కంటి సంరక్షణ, కార్డియాలజీ, పల్మనాలజీ, క్యాన్సర్, మోకాళ్లు, కీళ్ల నొ